# దెబ్బతిన్న పంటల పరిశీలన

**మొగుళ్లపల్లి:** రెండు రోజులుగా కురుస్తున్న వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలో ప్రాథమిక అందనా ప్రకారం మొక్కజొన్న 1132 ఎకరాలు, మిర్చి 340, పుచ్చకాయ 46 ఎకరాలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుదని జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి సురేందర్ రెడ్డి, ఆయా గ్రామాల ఏఈఓలు నాగరాజు, శ్రీకాంత్, యోగిత, జ్యోత్స్న, ప్రవళిక, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సంజీవరావు, మండల ఉద్యానవనశాఖ అధికారి సునీ, పిడిసిల్ల సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, రైతులు దేవెందర్, లింగారెడ్డి, శ్రీనివాస్, రామచందు తదితరులు పాల్గొన్నారు.

**టేకుమట్ల:** మండలంలో మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. కాగా మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని పంటలను పరిశీలిఅంచి నష్టాన్ని అంచనా వేశారు. మొక్కజొన్న 212, మిరప 223, వరి 52 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ధ్రువీకరించారు.

**రేగొండలో..**

రేగొండ మండలంలోని పలు గ్రామాల్లో రేగొండ మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రాథమికంగా మొక్కజొన్న 445, మిరప 175, మామిడి 25 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిపారు.



మొగుళ్లపల్లి: దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**పంటల పరిశీలన**

**మహాముత్తారం:** టీవల కురిసిన అకాల వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వేసిన మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. వాటిని అంచనా వేయడంతో పాటు పంటలో వచ్చే తెగుళ్లను గమనించడానికి సోమవారం బోర్లగూడెం వ్యవసాయ విస్తరన అధికారి ఆస్మా బోర్లగూడెం గ్రామంలోని మిర్చి పంటలను పరిశీలించి తెగుళ్లను ఆరికట్టడానికి రైతులకు పలు సూచనలు చేశారు.



రేగొండలో..



మహాముత్తారం: పరిశీలిస్తున్న ఏఈఓ



టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో..

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**గణపురం:** పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులందరికీ మిర్చి ఎకరాకు 70,000, మొక్కజొన్న ఎకరాకు 50,000 చొప్పున అందించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, సర్పంచ్ గండ్ర ఆగం రావు, నాయకులు భద్రయ్య, గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు దుర్గయ్య ఉన్నారు.

**మల్హర్:** అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తాడిచర్ల గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వివిధ మండలాల్లో రైతులు సాగు చేసిన మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు నేలకొరిగి, తడిసి ముద్దవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైన నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు పాల్గొన్నారు.



గణపురం: మిర్చి పంటను పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

**టేకుమట్ల:** మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుని పరిహారం అందించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్కటి రాజయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పసుల వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వేర్వేరు సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. రూ.లక్షల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు వర్షాలకు దెబ్బతినడంతో రైతులకు అప్పులే మిగిలే పరిస్థితి దాపురించిందన్నారు. కావున పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

## మార్కెట్ అభివృద్ధికి కృషి

**కాటారం:** కాటారం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యాల మమతమనోహర్ అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సోమవారం మొదటి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి సంబంధించి పలు తీర్మానాలు చేశారు. మార్కెట్ ఆవరణలో ప్రధాన రహదారి నుంచి కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని తీర్మానం చేశారు. మార్కెట్‌కు సంబంధించిన 12.09 ఎకరాల భూమిని కొలిచి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ జివాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ కార్యదర్శి, డీఎంఓ కనకశేఖర్, వైస్ చైర్మన్ రాధారపు స్వామి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వినతిపత్రం అందజేత



**మహదేవపూర్:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి నిరసనగా బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి సోమవారం నిరసన తెలిపారు. పేపర్ లీకేజీ విషయంలో ఎంతపెద్దవారు ఉన్న చట్టపరంగా కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిరిపురం శ్రీమన్నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మంథని రాజేందర్, బొల్లం కిషన్, మండల ఉపాధ్యక్షుడు రాజేందర్, రాంశెట్టి, రాకేష్, పున్నమి గౌడ్, రాజయ్య, శ్రీనివాస్, రవీందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలపై అవగాహన

**మొగుళ్లపల్లి:** మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ప్రభుత్వ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి ఎర్రన్న కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం సభ్యులు యాకుబ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ నెల 24 నుంచి మేదరమెట్ల గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఉచితంగానే చికిత్స చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరవింద్, పంచాయతీ సెక్రెటరీ శారద, ఎంపీటీసీ రాజేశ్వరరావు, గొల్ల రవి, టీం సభ్యులు ఎర్రన్న, దుప్పటి రవి, బండారి అనిత, మౌనిక, గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

### భూమి పూజ



**మహదేవపూర్:** మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు మంజూరైన నూతన భవనాలకు ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ సోమవారం భూమిపూజ చేశారు. మహదేవపూర్ మండలంలోని ఎడపల్లి గ్రామపంచాయతీ, అంబట్‌పల్లి గ్రామ పంచాయతీలకు నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల కోసం జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కొక్క గ్రామ పంచాయతీ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఎంపీటీసీ జయశ్రీ, సర్పంచ్ విలాస్ రావు, ఎడపల్లి సర్పంచ్ చిన్న మల్లయ్య, ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఏపీఓ రమేష్ తదితరులు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**కాటారం:** మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నారమల్ల సారయ్య అనే పాత్రికేయుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే విధి నిర్వహణలో భాగంగా చింతకాని వైపు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తున్న సారయ్య చింతకాని క్రాస్‌కు సమీపంలో రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన సారయ్యను గుర్తించిన వాహనదారులు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### పేకాట రాయుళ్ల అరెస్ట్

**చిట్యాల:** మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను సోమవారం అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నార్ల రాజు ఇంటి వెనుకాల పేకాట ఆడుతున్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లగా అక్కడ ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని తెలిపారు. వారిలో చిలుముల శ్రీనివాస్, గుర్రం అరవింద్, సాద మొగిలి, పిట్టల రవీందర్, నేపాలి రాజేష్ పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.1450 నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీస్ సిబ్బంది గౌస్, సిద్దార్థ, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బ్యాటరీ దొంగల అరెస్ట్

**కాటారం:** ట్రాక్టర్ బ్యాటరీ దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన సదానందానికి చెందిన ట్రాక్టర్ బ్యాటరీ దొంగతనం గతంలో దొంగతనానికి గురికాగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేసి మండల కేంద్రానికి చెందిన మాడెం ప్రవీణ్‌కుమార్, గంట పరిపూర్ణంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## మిషన్ అంత్యోదయపై గ్రామసభ

**మహదేవపూర్:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ శ్రీపతిబాపు అధ్యక్షతన సోమవారం మిషన్ అంత్యోదయపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని రకాల మౌలిక సదుపాయాల వివరాలను సేకరించి మిషన్ అంత్యోదయ ప్రత్యేక వెబ్ సైట్‌లో నమోదు చేయడం జరుగుతుందని, గ్రామ సభ ద్వారా వివరాలను అందజేయనున్నట్లు తెలిపారు. మిషన్ అంత్యోదయ ద్వారా గ్రామ సమగ్ర సామాజిక ఆర్థిక భౌగోళిక స్వరూపం తెలుస్తుందని, గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు వేయడానికి సమగ్ర వివరాలు ఉపయోగపడతాయని అన్నారు. 2023–24 వార్షిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ తైబజార్ వారసంత ఆదాయ వసూళ్ల కోసం వేలం పాట నిర్వహించడం జరిగిందని, వేలంలో గడ్డం నగేష్ రూ. 3.85లక్షలకు తైబజార్ టెండర్ దక్కించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, వార్డు సభ్యులు ఉస్మాన్ ఖాన్, పోతరామకృష్ణ, పంచాయతీ పారిశుద్ధ్య స్థాయి సంఘం కన్వీనర్ లింగాల రామయ్య, కోఆప్షన్ సభ్యులు రాజ్యలక్ష్మి, నాయకులు కారెంగుల బాపురావు, మెరుగు లక్ష్మణ్, చిలుక రమేష్, చింతకుంట్ల సతీష్, అంగన్వాడీలు, ఆశాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీపతిబాపు

## ‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అంబాల చంద్రమౌళి

**భూపాలపల్లి రూరల్:** ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఈనెల28న ఢిల్లీలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 28 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిరంతరం అలుపెరగని పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. అధికారంలోకి రాగానే 100 రోజుల్లో వర్గీకరణ అమలు చేస్తామని బీజేపీ మేనిఫెస్టోలో పెట్టిందని అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వర్గీకరణపై నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కో-కన్వీనర్ నోముల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల భిక్షపతి, మండల కన్వీనర్ అంతడుపుల సురేష్, పట్టణ కన్వీనర్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి పరామర్శ

**టేకుమట్ల(రేగొండ):** రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గాజుల రాజ్‌కుమార్ అనే గీత కార్మికుడు ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో సోమవారం సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్‌గౌడ్ అతడిని పరామర్శించారు. గౌడ సంఘం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా కల్పించారు. వృత్తిలో భాగంగా తాటి చెట్టు పైనుంచి పడి గాయపడ్డ రాజ్‌కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గీత కార్మిక సొసైటీ అధ్యక్షుడు ఈనాగపూరి శంకర్‌గౌడ్, ఏరుకొండ సంపత్, క్రాంతికిరణ్, గోపిగౌడ్, కాజయ్య, కుమార్, కిరణ్, తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న నాయకులు

## అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం



టేకుమట్ల: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

**టేకుమట్ల:** రాష్ట్రంలో అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని వెల్లంపల్లి, రాఘవాపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం ఎంతో మందికి వెలుగు నిస్తుందని అన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి కంటి వెలుగు వివరాలను వెల్లడించారు. వెల్లంపల్లి, రాఘవాపూర్ గ్రామాలలోని కంటి వెలుగు శిబిరంలో 308 మందికి కంటి పరీక్షలు చేసి, 57మందికి కంటి అద్దాలను అందించి, 96మందికి ఆర్డర్ చేసి, 65మందిని రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మిట్టపల్లి వనమ్మ, నందికొండ శోభా, ఎంపీటీసీలు సంగి రవి, ఏనుగు తిరుమల, ఆప్తాల్మిక్ డాక్టర్ రాజకుమారి, డాక్టర్ రవి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం రేణుక, శిరీషా, స్వరూప, రాజేశ్వరీ, ఆశా కార్యకర్తలు, శ్రావణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

**భూపాలపల్లి రూరల్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని గ్రామంలోని ప్రజలందరు సద్వినియోగం చేసేకోవాలని సర్పంచ్ రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యుడు కార్తీక్, కమ్యూనిటీ హెల్త్ అధికారి రాజయ్య, ఎఎన్ఎంలు స్వరూప, ఆగమ్మ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**మల్హర్:** మండలంలోని కొయ్యూరు గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ప్రమీల రాజునాయక్ అన్నారు. దుబ్బపేటలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రమీల సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్న వారికి కంటి అద్దాలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాత అతలాకుతలం

- అకాలవర్షంతో దెబ్బతిన్న పంటలు
- ఆందోళనలో రైతులు

**చిట్యాల:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికచ్చే సమయంలో ఆదివారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో మండలంలోని బొప్పాయి, మొక్కజొన్న, అరటి, మామిడి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల ఇంటి పై ఉన్న సిమెంట్ రేకులు పగిలిపోయాయి. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

**టేకుమట్ల:** మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వరి, మొక్కజొన్న పంటలు నేలవాడంతో పాటు, మిర్చి మొత్తం రాలిపోగా వేలల్లో పెట్టుబడి పెట్టి దిక్కు తోచని స్థితిలో రైతాంగం ఉంది.



టేకుమట్ల: అంకుషాపూర్‌లో నేల వాలిన మొక్కజొన్న



చిట్యాల: వర్షానికి రాలిన మిర్చి



చిట్యాల: నేలరాలిన బొప్పాయి చెట్లు

## చిరుధాన్యాల వంటకాలతో ఆరోగ్యం

**చిట్యాల:** చిరుధాన్యాలతో వండిన వంటలతో ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ వినోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం పోషణ పక్వాడా కన్వర్జెన్సీ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి నుంచి ఏప్రిల్ 3 వరకు ప్రతి గ్రామాల్లో చిరుధాన్యాల వంటకాలపై, వ్యక్తిగత శుభ్రతపై, స్కూల్స్, హాస్టల్స్, గ్రామాల్లో ఉన్న ప్రజలందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ఐదు శాఖలు సమన్వయంగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పోషన పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఒడితల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మౌనిక, ఐకేపీ మండల్ ప్రెసిడెంట్ నవత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న ఎంపీపీ వినోద

**సద్వినియోగం చేసుకోవాలి**

**టేకుమట్ల:** అంగన్‌వాడీ కేంద్రాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి అధ్యక్షతన పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ పక్వాడ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను గర్భిణులు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర మంత్రితో మాట్లాడి నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## కేసు నమోదు

**మహాముత్తారం:** కర్రతో దాడి చేసి ఒకరిని గాయపర్చి, ఇద్దరిని కొట్టిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాదారం గ్రామానికి చెందిన బచ్చల శ్రీను మరో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై మహాముత్తారం నుంచి నేతకానిపల్లి మీదగా మాదారం వెళ్తున్నారు. ఈ క్రమంలో నేతకానిపల్లే వద్ద అదే గ్రామానికి చెందిన తరుణ్‌తోపాటు మరి కొంత మంది వ్యక్తులు ముగ్గురిపై కర్రలతో దాడిచేసి గాయపర్చారు. శ్రీను ఫిర్యాదు మేరకు నేతకానిపల్లి గ్రామానికి చెందిన తరుణ్‌తోపాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## మానవులపై రేడియేషన్ ప్రభావం

**మహదేవపూర్:** పెరుగుతున్న టెక్నాలజీతో రేడియేషన్ అధికం అవుతుందని, దాంతో మానవ జీవన విధానంపై ప్రభావం పడుతుందని ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్ రహత్‌ఖానమ్ అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ రాజు ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో నిర్వహించారు.. ఈ సందర్భంగా రహత్ ఖానమ్ మాట్లాడుతూ.. జీవన శైలిలో పెనువేగంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా పిచ్చుకలు అంతరించి పోతున్నాయని అన్నారు. పచ్చదనం, పళ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గడం పిచ్చుకలు అంతరించి పోవడానికి కారణాలని అన్నారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ.. మానవుడు పెంచుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానం పిచ్చుకల మనుగడకు శాపంగా మారిందన్నారు. మొబైల్ ఫోన్ తరంగాల రేడియేషన్, కాలుష్యం, వివిధ రకాల కారణాలతో ప్రకృతి నుంచి కనుమరుగవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రజిత, పరుశురాం, మున్నయ్య, రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, రవీందర్, ఆత్రే, మహేష్ అధ్యాపకేతర బృందం వేణుగోపాల్, రవీందర్, వెంకటయ్య, శివ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రహత్‌ఖానమ్

## ఆధార్ అప్‌డేట్ సెంటర్ తనిఖీ

**కాటారం:** మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను ఎంపీడీఓ శంకర్‌నాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2016 కంటే ముందు ఆధార్‌కార్డు తీసుకున్న వారు ఉచితంగా అప్‌డేట్ చేసుకునేలా గ్రామ పంచాయతీ అధికారులు, పాలకవర్గం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కొత్తపల్లిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం, నిర్వహణపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

